www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 26 డిసెంబర్ 2024
5
అన్నమయ్య

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మినీ అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు జనవరి 2వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ నాగవేణి కోరారు. మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కేంద్రం సహాయకులు అత్తమ్మగారిపల్లె బిసి-బి, మరి మాకులపల్లి ఒసి (ఒహెచ్), కొటాల (ఎస్‌టి), గోపిదిన్నే (ఎస్‌సి), దిగువ సుగాలితాండ (ఎస్‌టి), ఉప్పులూర మాండ్లపల్లె (ఒసి), మండెంవారిపల్లె(ఎస్‌సి), మూలపల్లె (బిసిఎ), కురబలకోట మండలం మన్యంవారిపల్లె (బిసిడి), నందిరెడ్డిగారిపల్లె(ఇడబ్ల్యూఎస్), కమటంపల్లె(ఎస్‌సి), చేనేత నగర్(బిసిబి), పెద్దమండెం మండలంలోని గుడిసి వారి పల్లె (ఒసిహెచ్‌హెచ్), కురబలకోట మండలం ఆర్‌సి.కురోపల్లె మినీ అంగన్వాడీ కార్యకర్త ఒసి క్యాటగిరి మేరకు రిజర్వేషన్ కల్పించినట్లు చెప్పారు. స్థానికులై ఉండి పదవ తరగతి పాసై 21 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు వయసులోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. దరఖాస్తుతో పాటు విద్యారహత, కులం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. 2025 జనవరి 2వ తేదీ లోపు ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

'తల్లికి వందన'మేదీ?

- ఆర్నెళ్లుగా...
తప్పని నిరీక్షణ
- 3,26,752 మంది
తల్లులు ఎదురుచూపులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తల్లికి వందనం పథకం అమలు కోసం తల్లిదండ్రులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఆర్నెళ్లుగా విద్యార్థుల డేటా, నిధుల లేమి వంటి కారణాలతో కాలయాపన చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికీ రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. వైసిపి హయాంలోని అమ్మఒడి పథకం పేరు మార్పు, ఇటీవలి బడ్జెట్‌లో రూ.2,326 కోట్లు కేటాయింపులు చేయడం మినహా ఎటువంటి పురోగతి కనిపించలేదు. ఇటీవలి కేబినెట్ సమావేశంలోనూ తల్లికి వందనంపై ఎటువంటి చర్చా లేకుండా ముగించడంతో తల్లికి వందనం పథకం ఈ ఏడాది అమలు చేసే ఉద్దేశం లేనట్లు తేటతెల్లం కావడం గమనార్హం.

ఉమ్మడి కడప జిల్లాలో 2,823 పాఠశాలలు ఉన్నాయి. 3,26,752 మంది విద్యాభ్యాసం సాగిస్తున్నారు. 2022-23 సంవత్సరంలో అప్పటి వైసిపి సర్కారు అమ్మఒడి పథకం కింద 1.80 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.270.30 కోట్లు జమ చేసింది. 2021-22 సంవత్సరంలో 1.79 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.244.06 కోట్లు జమ చేసింది. వైసిపి సర్కారు నాలుగేళ్లపాటు జనవరి, జూన్ మాసాల్లో వరుసగా అందజేసింది. అమ్మఒడి నిధుల సహకారంతో ప్రయివేటు, కార్పొరేట్ అధిక ఫీజుల చెల్లింపుల సమయంలో తల్లిదండ్రులకు పెద్ద ఉపశమనం లభించేది. రాష్ట్రంలోని కూటమి సర్కారు ఆర్నెళ్లుగా సామాన్యుల ఆశలతో ఆడుకోవడం భారంగా పరిణమించింది. ఫలితంగా జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఫీజుల చెల్లింపు భారంగా మారింది.

తల్లుల ఎదురుచూపులు

తల్లికి వందనం పథకం కోసం విద్యార్థుల తల్లులు ఎదురుచూస్తున్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున జమ చేస్తామని ప్రభుత్వం నమ్మబలికింది. ఆర్నెళ్లు గడిచి పోతున్నప్పటికీ తల్లికి వందనం అమలును విస్మరించింది. ఫలితంగా తల్లిదండ్రులు ప్రయివేటు, కార్పొరేట్ ఫీజుల చెల్లింపు పెనుభారంగా మారింది.

డేటా మెలిక...దేనికో!

కూటమి సర్కారులో చిత్తశుద్ధి కొరవడిన కారణంగానే తల్లికి వందనం అమలు కావడం లేదనే వాదన వినిపిస్తోంది. శాసన మండలిలో విద్యా శాఖా మంత్రి లోకేష్ తల్లికి వందనం పథకం అమలుపై స్పందిస్తూ లబ్ధి దారుల డేటా లేని కారణంగా ఇవ్వలేకపోతున్నామనడం దేనికి సంకేతమో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ నేపథ్యంలో పిల్లల ందరికీ తల్లికి వందనం ఇవ్వాల్సి వస్తే రెట్టింపు వ్యయం చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల ముగింపు సంవత్సరమైన 2022-23లో వైసిపి సర్కారు రూ.270 కోట్లు చెల్లించిన సంగతి తెలిసిందే. ఈలెక్కల్ని పరిగణలోకి తీసుకుని లెక్కిస్తే రూ.500 కోట్లుపైగా చెల్లించాల్సి వచ్చే అవకాశం ఉండడంపై మీన మేషాలు లెక్కిస్తున్నట్లు కనిపిస్తోంది. కూటమి సర్కారు వైఖరిని పరిశీలిన చేస్తే ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్, ఎయిడెడ్, కళాశాలల విద్యార్థుల్లో ఎవరికి మొండిచేయి చూపుతుందోననే ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొని ఉంది.

క్రిస్మస్ వేడుకల్లో మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

కడప జిల్లాలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం రెండో రోజు కడప జిల్లా పులివెందులలోని సిఎస్ఐ చర్చిలో తన తల్లి వైఎస్.విజయమ్మ, సతీమణి వైఎస్.భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థన కూట మిలో పాల్గొన్నారు. అనంతరం సిఎస్ఐ చర్చిలో విజయమ్మతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి ఆమెకు తినిపించారు. సిఎస్ఐ చర్చి రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను జగన్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనా కూటముల అనంతరం చర్చిలో జగన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్య పథం వైపు నడవాలని చెప్పారు. కరుణామయుని ఆశీస్సులు అందరికీ అందాన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్. అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, రాయ చోటి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులు, వైఎస్ కుటుంబ సభ్యులు వైఎస్.ప్రకాష్‌రెడ్డి, వైఎస్. మనోహర్‌రెడ్డి, వైఎస్.మదన్ మోహన్‌రెడ్డి, వైఎస్. ప్రతాపరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, ప్రజాప్రతి నిధులు, చర్చి పాస్టర్స్ పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, తల్లి విజయమ్మ

జగన్‌కు కేక్ తినిపిస్తున్న తల్లి విజయమ్మ

కోదండ రామునికి పట్టు వస్త్రాలు సమర్పించిన జగన్

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లెలో రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన శ్రీకొండడ రాముని ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, ఆలయాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రారంభించారు. భక్తి శ్రద్ధలతో సీతారాములకు ఆయన పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు ఆలయ పెద్దలు, గ్రామ స్థులు జగన్‌ను మార్యాదపుర్వంగా ఆహ్వానించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఆయనకు పలు రకాల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు అంతకు ముందు పులివెందులలో సిఎస్ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తర్వాత ప్రత్యేక వాహనంలో లింగాల మండలోని ఇప్పట్ల, చిన్న కూడాల, లింగాల, కార్నపాపయ్యపల్లె, వెలిదండ్ల వైసిపి నాయకులు, కార్యకర్తలను దారిపొడవునా పరామర్శించారు. కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, తాతిరెడ్డిపల్లె సర్పంచ్ శివరామిరెడ్డి, జడ్‌పి టిసి పుష్పా, తాతిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ మల్లికేశవరెడ్డి, ఎంపిపి రమాదేవి పాల్గొన్నారు.

డ్రెయినేజీ కాలవలను శుభ్రం చేయిస్తున్న పంచాయతీ సిబ్బంది ఓబులేష్

మురుగు కాలువల్లో పూడికతీత పనులు

ప్రజాశక్తి-సుండుపల్లి

సుండుపల్లి పట్టణ పరిధిలోని డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని బుధవారం పంచాయతీ సిబ్బంది ఓబులేష్ దగ్గరుండి తీయించారు. చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీరు స్తంభించి రోడ్డుపై రావడంతో స్థానికుల ఇబ్బందులు పడేవారు. విషయం ఓబులేష్ దృష్టికి రావడంతో ఆయన పంచాయతీ అధికారి రామ్మోహన్ ఆదేశాల మేరకు శుభ్రం చేయించి చెత్తాచెదారాన్ని కాల్వలో వేయరాదని చుట్టుపక్కల వారికి సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. డ్రెయినేజీలో చెత్తను తొలగించడంతో స్థానికులు ఓబులేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

హౌసింగ్ కాలనీకి దారి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని బద్దిపల్లిగుట్టలో 30 అడుగుల రోడ్లతో హౌసింగ్ కాలనీని ప్రభుత్వం మంజూరు చేసింది. కాలనీలోకి వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్ అక్కడికి తరలించాలంటే నానా తంటాలు పడుతున్నారు. అధికారులేమో ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు కానీ, అందుకు సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోలేదు. నాలుగు నెలల ముందు గృహనిర్మాణ శాఖ నుండి డిఇ, ఇఇ బద్దిపల్లిగుట్టలోకి పర్యటించినప్పుడు తాము ఇండ్లు కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాం కానీ, ఈ రోడ్డు దుస్థితి ఇలా ఉందని అధికారుల దృష్టికి తీసుకుపోతే వారం రోజుల్లోగా సిద్ధం చేస్తున్నామని చెప్పి నాలుగు నెలలైందని పేర్కొన్నారు. ఇంత ఎవరు కూడా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అడవిని తలపించేలా రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆ పెద్ద పెద్ద రాళ్లను, గుండ్లను, చెట్లను, తొల గించేలా సంబంధిత అధికారులకు ఇప్పటికైనా ఆదేశించాలని గృహ నిర్మాణ లబ్ధిదారులు, ప్రజలు కోరుకుంటున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కార్యకర్తలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలం కేంద్రంలో మధుకర్‌రెడ్డి నూతనంగా నిర్మించిన భవనంలో జైకిసాన్ ఫర్టిలైజర్ అండ్ ఫార్మర్ రిక్వైర్మెంట్స్ షాపును ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఆయన వెంట మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- చేతికి అందే ఎత్తులో విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురంలో వాటర్ స్కీం కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ చేతికి అందే ఎత్తులో ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం చిన్నారులు తిరుగుతుండే ప్రాంతం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని తెలియని పరిస్థితి. గతంలో పశువులు ప్రమాదానికి గురైన సంఘటనలున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను ఎత్తులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

తాగునీటి పథకం వద్ద చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

విచారణ బాధ్యతల నుంచి సిఐని తప్పించాలి

- నిజనిర్ధారణ కమిటీ డిమాండ్

మాట్లాడుతున్న నిజనిర్ధారణ కమిటీ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

గాలివీడు మండలం బోడిరెడ్డిగారిపల్లె వద్ద ఈనెల 23న చోటు చేసుకున్న మల్లెల వెంకటరమణ(25) హత్య కేసును విచారిస్తున్న లక్కిరెడ్డిపల్లి సిఐ కొండారెడ్డి కేసును నీరు కార్చే ప్రయత్నంలో ఉన్నారని, విచారణ బాధ్యతల నుండి ఆయన్ను తప్పించాలని ప్రజా స్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఒపిడిఆర్) రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. ఈశ్వర్ నేతృతంలో ఏర్పడిన నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్ చేశారు. కళాకారుడి హత్య సంఘటనపై బుధవారం ఉదయం నుంచి నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు రజక సంఘం అధ్యక్షులు టీ.రమేష్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసులు ఎపి వడ్డెర విద్యావంతులు వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి మారుతి శంకర్, విద్యావంతులు వేదిక నాయకులు జీవానందం, కోటకొండ రవిశంకర్,భోగేశ్వర్, బండల శీను, శ్రీరాములు, ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డయ్య గాలివీడు మండలం బోరెడ్డిగారిపల్లె ప్రాంతాన్ని సందర్శించారు. స్థానికులను, ప్రత్యక్ష సాక్షులను, పోలీసులను విచారించారు. అనంతరం కమిటీ సభ్యులు రాయచోటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హత్య జరిగిన రోజు నుంచి ఈ కేసును సరైనపద్ధతిలో విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు, ఇప్పటివరకు కేసులో జరిగిన లోపాలను డిఎస్‌పి కృష్ణమోహన్‌ను వివరించినట్లు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా ఒపిడిఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్ మాట్లాడుతూ మల్లెల వెంకటరమణను హత్య చేయడానికి రమణారెడ్డితో పాటు మరో ఇద్దరు పాల్గొనట్లుగా అక్కడ ఉన్న ఆధారాలను బట్టి స్పష్టం అవుతుందని ఆయన అన్నారు. మృతుడి సోదరుడు మల్లెల ఆంజనేయులు జరిగిన సంఘటన గురించి వివరిస్తున్నప్పటికీ లక్కిరెడ్డిపల్లి సిఐ కొండారెడ్డి అతని మాటలు ఏ మాత్రం పట్టించుకోకుండా ఆంజనేయులు సెల్ ఫోను కూడా లాకున్నారన్నారు. రమణారెడ్డితో పాటు అతని కుమారులు శివారెడ్డి, రామాంజుల రెడ్డి కూడా నేరంలో పాల్గొన్నట్లు హతుడి సోదరుడు చెబుతున్నప్పటికీ సిఐ మాత్రం రమణారెడ్డి పేరును మాత్రమే ఎఫ్ఆర్ఐ చేర్చడం కేసును బలహీనపరచడమే అవుతుందన్నారు. నేరం జరిగి మూడు రోజులు అవుతున్నా నేర స్థలంలో రక్తపు మరకలతో వివిధ సైజులలో ఉన్న నాలుగు రాళ్లను సీజ్ చేయడంలో నిర్లక్ష్యం చేశారని, నేరస్తులపై నేరం రుజువు కావడానికి నేర స్థలంలో రక్తపు మరకలతో ఉన్న నాలుగు రాళ్లు ప్రధాన భూమిక పోషిస్తాయని పేర్కొన్నారు. అలాంటి ఆధారాలను పోలీసు ప్రొసీడింగ్స్ ప్రకారం సీజ్ చేయకపోవడం ఎందుకో సిఐ చెప్పాలని ఆయన అన్నారు. మొదటి నుంచి కూడా సిఐ కొండారెడ్డి బాధితులను బెదిరిస్తూ విచారణలో నిర్లక్ష్యం వహిస్తూ వస్తున్నందున న్యాయం జరిగే అవకాశం లేదని ఈ కేసు విచారణ సవ్యంగా జరుగుతుందనే నమ్మకం బాధితులకు లేదని ఆయన అన్నారు. ఈ పరిస్థితులలో సిఐ కొండారెడ్డిని విచారణ బాధ్యతలు నుండి తప్పించి మరొక నిజాయితీ అధికారిని విచారణ కోసం నియమించాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు.

పీలేరు:పట్టణంలో క్రిస్మస్ సంబరాలను వేడుకగా జరుపుకున్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పట్టణంలోని అన్ని క్రైస్తవ చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో మంగళవారం రాత్రి నుంచి జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చర్చిల పాస్టర్లు, ప్రార్థన మందిరాల నిర్వాహకులు ఏసుక్రీస్తు జననం గురించి, క్రిస్మస్ పండుగ ప్రాధాన్యత గురించి భక్తులకు వివరించారు. క్రైస్తవ సోదర, సోదరీమణులు తమ పిల్లలతో సహా ఈ ప్రత్యేక ప్రార్థనలకు హాజరై పాస్టర్లు ఇచ్చిన సందేశాలను అత్యంత భక్తి శద్ధలతో విన్నారు. బుధవారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల అనంతరం మధ్యాహ్నం చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ఏర్పాటు చేసుకున్న విందు భోజన కార్యక్రమాల్లో అందరూ పాల్గొన్నారు. పీలేరు పట్టణంలోని సెయింట్ జాన్స్ పాల్ లూథరన్ చర్చ్ పాస్టర్ సుందర్ రావు, ఇమ్మానుయేలు చర్చిలో పాస్టర్ సిఇ జోసఫ్, ఇతర ప్రార్థన మందిరాల పాస్టర్లు, క్రైస్తవ సోదర, సోదరీమణులు, వారి పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని జీసస్ జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపు కున్నారు. **నిమ్మనపల్లి :** క్రైస్తవ సోదరులు ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రిస్మస్ పండుగను వెంకోజీగారిపల్లి, నిమ్మనపల్లి, గుండ్ల బురుజు, రాచవేటివారిపల్లి, రెడ్డివారిపల్లి, బండ్లపై, ముష్టూరు, అగ్ర హారం, సామకోటవారిపల్లి, వెంగంవారిపల్లి, ఎగువ మాచిరెడ్డిగారిపల్లి, దిగువ మాచిరెడ్డిగారిపల్లి తదితర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు జయకుమార్, బాబు, రాజు, వీరణాల మాణిక్యం బైబిల్‌లోని అంశాలను భక్తులకు బోధించారు. అనంతరం క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదరులు శుభాకాంక్షలు తెలుపుకొని, మిఠాయిలు పంచుకున్నారు. **కలకడ :** క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లె, కోన పంచాయితీ గంగిరెడ్డిగారిపల్లె, దేవనపల్లి, కొత్తపల్లి, శ్రీనివాసపురం తదితర గ్రామాలలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించున్నారు.తమ చర్చిలలో ప్రార్థనలు నిర్వహించుకుని పాస్టర్ చెప్పే నీతి వాక్యాలను విని గేయాలు పాడుకుని అంగరంగ వైభవంగా తమ ఆలయాలను విద్యుత్ విపారాధన అలంకరించుకుని ప్రార్థనలు చేసుకున్నారు. **సుండుపల్లి:** మండలంలోని పెదినే కాలువ గ్రామ పంచాయతీ సత్రం, ఇందిరానగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిమ్మ సముద్రంలో చర్చిలలో క్రిస్మస్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఫాస్టర్ పుత్తా జాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రజలకు శాంతి సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో ఫాస్టర్‌తోపాటు సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్, వెంకటేష్, ఆంజనేయులు, మస్తాన్ ప్రార్థనలు చేశారు. **వీరబల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రార్థనా మందిరాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. వంగిమళ్ళ, పుత్తవాండ్లపల్లి, వీరబల్లి, సానిపాయి, తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు చేసు కున్నారు. విద్యార్థులు మేరీమాత వేషధారణలో పలువురిని అలరింపజేశారు. విద్యార్థుల నృత్యాలు, గానాల నాటిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ప్రేమ, క్షమాగుణం, కరుణ, ఏసు బోధనలతో క్రైస్తవులు సంతోషంగా పండుగా జరుపుకున్నారు. క్రైస్తవ మతాన్ని అనుసరించే వారందరికీ ఏసుక్రీస్తులో ఉన్న ప్రేమ సంతోషానికి కృతజ్ఞతలు తెలిపే అవకాశం ఇస్తుంది. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని పాస్టర్లు వివరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **రామాపురం :** మండలంలో కిస్మస్ వేడుకలు ఘనంగా జరి గాయి. స్థానిక ఆర్‌సిఎం చర్చితో పాటుగా లక్కిరెడ్డిపల్లి రహదారిలోనే ఉన్న చర్చిలో అర్ధరాత్రి పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. పశువుల పాక, విద్యుత్ వెలుగులు, శాంటాక్లాస్ వేషదారణ ఆకట్టుకున్నాయి. ఫాదర్లు జాన్సన్ కిస్మస్ ప్రాముఖ్యతను, కీస్తు పుట్టుకను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. **తంబళ్లపల్లి :** మండలంలోని అన్ని చర్చిల్లో క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవ సోదరులు జరుపుకొన్నారు. ఉప్పులూరు వాండ్లపల్లి, చింపిరెడ్డిగారిపల్లె, భద్రయ్యపల్లె, పంచాలమర్రిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. తంబళ్లపల్లె సిఎస్ఐ చర్చిలో పాస్టర్ పాల్రాజు క్రీస్తు సందేశాలను చదివి వినిపించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.అన్నదానం నిర్వహించారు.

లూథరన్ చర్చ్‌లో భక్తులకు సందేశం ఇస్తున్న పాస్టర్ సుందర్‌రావు

వెంకటరెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

వెంకటరెడ్డిని పరామర్శించిన శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

రాచపల్లి సర్పంచ్ వెంకటరెడ్డిని బుధవారం వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. వెంకటరెడ్డి ఇటీవల గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని కడపలోని తన నివాసంలో విశ్రాంతి పొందుండగా వైసిపి రాష్ట్రప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి వెంకటరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట వైసిపి నాయకులు వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నారు.

తప్పుడు కేసులు పెట్టడం దారుణం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నల్లతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు గడికోట వెంకట సుబ్బారెడ్డిపై కక్షపూరితంగా కావాలనే అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు పోలీసులు తప్పుడు కేసు పెట్టడం దారుణమని వైసిపి జిల్లా యువజన విభాగం నాయకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గం గుండ్లూరులో నూతనంగా కన్స్ట్రక్షన్ జరుగుతున్న తన స్థలంలో రూ.ఏడు లక్షలు విలువచేసే సామాన్లను దొంగలించారని ఆయన కేసు పెట్టినా సరే ఇంతవరకు దానిపై సమగ్ర విచారణ జరపకుండా తిరిగి ఆయన పైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలోకి రావాలని ఆయనపై ఒత్తిడి తీసుకు వచ్చినా సరే, ఆయన కరాకండిగా వైసిపిలోనే తన రాజకీయ భవిష్యత్తు కొనసాగుతుందని తేల్చి చెప్పడంతో ఎలాగైనా ఆయనపై పగ తీర్చుకోవాలని ఈ విధంగా లేనిపోని కేసులు పెట్టి హింసించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలియజేశారు. వైసిపి కార్యకర్తలు, నాయకులు ఎవ్వరూ అధైర్యపడవద్దని పార్టీ ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందన్నారు. రాబోయేది జగనన్న ప్రభుత్వమేనన్నారు.

పేద విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బాల సదన్‌లోని పేద విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్ విజయ్ కుమార్ తల్లిదండ్రులు కొండూరు రెడ్డి రాజు, ధనలక్ష్మి జ్ఞాపకార్థం బుధవారం పాత బస్టాండ్ కూడలిలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి అనంతరం బాలసదనలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు నరసింహారాజు, జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు తెలియజేశారు. సేవా కార్యక్రమాలలో లైన్స్ క్లబ్ ఎల్లప్పుడు ముందు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు మలిశెట్టి సుబ్బరాయుడు, రీజన్ చైర్మన్ బాబు, జోన్ చైర్మన్ వై.సుబ్రహ్మణ్యం రాజు, సీనియర్ ప్రతినిధి టీ.లక్ష్మీనారాయణ, కోశాధికారి నరసింహ, మద్దిపట్ల రామకృష్ణ నాయుడు, వెంకటరమణ, నాగేశ్వరరావు, నాసరుద్దీన్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

- సేవ్ పబ్లిక్ సెక్టార్ కన్వీనర్ రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రైతులు, మధ్య తరగతి, వ్యాపార వర్గాలకు ఎంతో ఉపయోగంగా ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కన్వీనర్ రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానికంగా బుధవారం జరిగిన సమావేశంలో కరపత్రాలను పలు సంఘాల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిజిబి రైతులకు మధ్య తరగతి ఖాతాదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కరువు పీడిత, వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. దేశంలో ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో అగ్రస్థానంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉందన్నారు. 552 శాఖలతో రూ.50 వేల కోట్ల టర్నోవర్‌తో రూ.802 కోట్ల లాభాలతో రూ.4591 కోట్ల రిజర్వుతో వ్యాపార అభివృద్ధిలో మిగతా గ్రామీణ బ్యాంకుల కన్నా అగ్ర భాగాన ఉందన్నారు. ఇక్కడ 2,800 ఉద్యోగులు పనిచేస్తున్నారని, మిగిలిన మూడు గ్రామీణ బ్యాంకుల్లో ఉద్యోగులను కలిపినా అంతమంది లేరన్నారు. ఏ బ్యాంకు అయితే డిపాజిట్లు టర్నోవర్ ఎక్కువగా ఉంటే ఆర్థిక శాఖ మార్గదర్శకాల తొలి ప్రాధాన్యత ప్రకారం తీసుకోవాలన్న సూచన ఉందన్నారు. ఆ ప్రకారం కడప ప్రధాన కార్యాలయాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆందోళన కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. జెవివి రాష్ట్ర నాయకుడు తవ్వా సురేష్ మాట్లాడుతూ త్వరలో ఓ సదస్సు నిర్వహిస్తామని, అందులో కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఇ.శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్బర్ బాషా, ప్రొద్దుటూరు బ్రాంచ్ కార్యదర్శి నరసింహులు, గ్రంథాలయ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబ్జి, డెవలప్మెంట్ ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఎల్ఐసి ఏజెంట్ ఫెడరేషన్ డివిజన్ కోశాధికారి కృష్ణ, ఎపిజిబి రాజేష్, జెవివి నాయకులు మురళి గుప్తా, డాక్టర్ చక్రధర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

29న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు టివిఆర్ హైస్కూల్ సమీపంలో జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి అమర్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు, 18,16ఏళ్లలోపు బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్గొన దలచిన వారు వయసు ధ్రువీకరణకు ఆధార కార్డు తమ వెంట తీసుకురావాలని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ (దూరపు పరుగు పందెం పోటీలు) జనవరి 5న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరుగుతాయని అన్నారు. వివరాలకు 99496 86586ను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాసులును సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

జ్యువెలర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-పీలేరు

జువెలర్స్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శిగా పీలేరుకు చెందిన ముచ్చర్ల జ్యువెలర్స్ యజమాని శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యువెలరీ అసోషి మేషన్ సమావేశం బుధవారం తిరుపతి వైస్రాయ్ హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల జ్యువెలర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాసులు మాట్లడుతూ బంగారు దుకాణాలకు వచ్చే వినియోగదారుల మధ్య పేద, ధనిక అనే తేడాలు లేకుండా వారిని సంతృప్తి పరచాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ జువెలర్స్ అసోసియేషన్ కీలక పాత్ర వహించాలని సూచించారు. తాను అటు ప్రభుత్వానికి, ఇటు బంగారు వ్యాపారులకు మధ్య సమన్వయకంగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి, పుత్తూరు, చిత్తూరు, బి.కొత్తకోట, మదనపల్లి, రాయచోటి జ్యువెలర్స్ అసోసియేషన్స్ నాయకులు పాల్గొన్నారు.

మినుము నూర్పిడి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

రబీలో సాగు చేసిన మినుము పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది మినుము పంట సాగును అధికంగా చేపట్టారు. గత ఖరీఫ్‌లో వరి సాగు చేయని రైతులు మినుము సాగు చేపట్టారు. ఎకరాకు 3 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడులు వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. అధిక వర్షాలకు దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. క్వింటా రూ.8 వేలకుపైగా ధరలు పలుకుతున్నాయి. జిల్లాలో 15 వేల ఎకరాల్లో మినుము సాగైంది. గత ఏడాది మినుములు ఎకరాకు 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఏడది సగానికిపైగా దిగుబడులు తగ్గాయి. పెట్టుబడి భారం ఉండి, దిగుబడి తక్కువగా వచ్చే పంటల సాగు తగ్గిస్తున్నారు. జిల్లాలో వరి తర్వాత వేరుశనగ, శనగ ప్రధాన పంటలుగా చాలా ఏళ్లుగా రైతులు సాగు చేస్తున్నారు. ఆయా పంటలు మూడేళ్లుగా ఆశాజనకంగా కనిపించడం లేదు. వాతావరణంలో మార్పుల కారణంగా పంట దిగుబడులు తగ్గిపోవడం, నాణ్యత లేకపోవడం, జింక్ లోపంతో పెట్టుబడి సమస్య ఎక్కువ కావడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది వేరుశనగ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. అయితే సాగకు అధిక ఖర్చులు అవుతుండటంతో ఎక్కువ పెట్టుబడి భారం కానీ మినుము పంట వైపు రైతులు దృష్టి సారించారు. మినుము పంటలో కూడా దిగుబడులు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువగానే ధరలు వస్తుండడం, వ్యవసాయ అధికారులు కూడా ఎప్పుడూ ఒకే రకం పంటలు సాగు చేయడం వల్ల దిగుబడులు రావడం లేదని సూచించారు. పంట మార్పిడితో దిగుబడులు పెరుగుతాయని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఏడాది పంట మార్పిడి పద్ధతి అవలంభించాలని రైతులకు సూచిస్తున్నారు.

మినుము పంటను నూర్పిడి చేస్తున్న రైతు

అమిత్‌షా రాజీనామా కోరుతూ..

30న నిరసనలను విజయవంతం చేయాలి

- జమిలి ఎన్నికల ప్రతిపాదన సమాఖ్య వ్యవస్థపై వేటు
- వామపక్ష పార్టీల కడప జిల్లా కార్యదర్శులు

ప్రజాశక్తి - కడప అర్బన్

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా కోరుతూ ఈ నెల 30న ఆందోళన జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల జిల్లా కార్యదర్శులు పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ కార్యదర్శి రమణయ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్‌షా, ప్రధాని నరేంద్ర మోడీ ఇందుకు బాధ్యత వహించడానికి, దిద్దుబాటు చర్యలకు సిద్ధపడకపోవడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో నిరసనలను కొనసాగించాలని లెఫ్ట్ పార్టీలు భావించాయని తెలిపారు. 30న జాతీయ నిరసన దినాన్ని పాటించాలని నిర్ణయించామని చెప్పారు. ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైన మోడీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రయివేటు కంపెనీల చేతుల్లో పెట్టి, సంపదను అంబాని, ఆదానికి దోచిపెడుతూ ప్రజలు, ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెట్టేసారని విమర్శించారు. కులం, మతం, ప్రాంతం, భావం పేరుతో ప్రజల మధ్య వైశ్యామ్యాలు రెచ్చగొట్టి ఒక ప్రణాళికాబద్ధంగా ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీ, మహిళలపై హింసను ప్రేరేపిస్తున్నదన్నారు. స్వతంత్ర సంస్థలైన సిబిఐ, ఈడి, ఎన్నికల కమిషన్ ను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ, న్యాయవ్యవస్థను కూడా ప్రభావితం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చలాయిస్తోందని పేర్కొన్నారు. బహుజనుల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను తలుచుకుంటే ఏమొస్తుంది అంటూ అవాకులు, చెవాకులు పేలిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా మాటల వెనుక ఆర్ఎస్ఎస్ మనువాద ఎజెండా దాగి ఉందన్నారు. మనసు నిండా మనువాదాన్ని నింపుకుని అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించే బిజెపి నేతలకు రాజ్యాంగబద్ధ పదవుల్లో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. భారత జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు

ఒక దేశం, ఒక ఎన్నిక ప్రతిపాదనను వామపక్షాలు వ్యతిరేకించాయని పేర్కొన్నారు. ఇందుకోసం రాజ్యాంగ సవరణ బిల్లుతో సహా రెండు బిల్లులను ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని తెలిపారు. రాజ్యాంగానికి ప్రతిపాదించిన సవరణలు సమాఖ్య వ్యవస్థపైన, రాష్ట్రాల శాసనసభలు, వాటిని ఎన్నుకున్న ప్రజల హక్కులపై నేరుగా దాడి చేయడమేనని విమర్శించారు. శాసనసభల ఐదేళ్ళ కాలపరిమితిని ఏకపక్షంగా కుదించడం అధికార కేంద్రీకరణ దిశగా తీసుకున్న చర్యలన్నారు. ఇది ప్రజల అభిమతానికి విరుద్ధమని చెప్పారు. సిసిటివి కెమెరా, వీడియో ఫుటేజ్ వంటి ఎలక్ట్రానిక్ రికార్డులను బహిరంగంగా తనిఖీ చేయడానికి గల హక్కును ఈ సవరణతో రద్దు చేశారని విమర్శించారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

అపర చాణక్యుడు వీరారెడ్డి

- దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- ఘనంగా బిజివేముల వీరారెడ్డికి నివాళి

వీరారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి - బద్వేలు

కడప జిల్లా రాజకీయాన్ని తన కనుసైగల్లో నియంత్రించిన అప చాణక్యుడు వీరారెడ్డి అని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి, క్రీ.శే. బిజివేముల వీరారెడ్డి 24 వ వర్ధంతిని పురస్కరి ంచుకొని బుధవారం ఎస్‌బివిఆర్ కళాశాల ప్రాంగణంలోని వీరారెడ్డి ఘాట్ వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పట్ట ణంలోని నాలుగు రోడ్ల కూడలిలోని వీరారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వీరారెడ్డి సమితి ఎన్నికల్లో పోటీ చేసిన తర్వాత ఆరుసార్లు బద్వేల్ ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా పనిచేసి రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలను ప్రజలు తిలకి ంచారు. హైదరాబాద్‌కు చెందిన మెడ్ విజ్ కంటి, దంత, షుగర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలు తండోప తండాలుగా వచ్చివైద్య చికిత్సలు పొందారు. అవసరమైన వారికి మందులు కూడా నిర్వాహకులు అందజేశారు. భారీ ఎత్తున బివిఎస్ఆర్ కళాశాల ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ రెడ్డి, లీల కైవల్య రెడ్డి, జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త భూపేష్ రెడ్డి, ప్రముఖ నేత్ర వైద్యులు రవికుమార్ రెడ్డి, బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రజా నాయకుడు మంచూరు సూర్యనారాయణరెడ్డి, జడ్‌పిటిసి జయరాం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు మునిరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, బద్వేల్ పట్టణ అధ్యక్షులు వెంగల్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు రవి కుమార్ రెడ్డి, నియోజకవర్గంలోని ఆయా మండలాల టిడిపి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

సమతారాజ్య స్థాపనకు భారత రాజ్యాంగం అవసరం

- ప్రజా సంఘాల పిలుపు

ప్రజాశక్తి-పీలేరు

సమతారాజ్య స్థాపనకు భారత రాజ్యాంగం అవసరం ఎంతో ఉందని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు ప్రజా సంఘ నాయకులు పల్లం సురేంద్ర అధ్యక్షతన మనుస్మృతి నశించాలి, రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ మను స్మృతి గ్రంధ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు అమృత తేజ, పీలేరు మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ సంయుక్తంగా మాట్లాడుతూ 1927 డిసెంబర్ 25న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహారాష్ట్రలోని మహద్ పట్టణం చౌదారు చెరువు మంచినీళ్ల పోరాటం సందరర్భంగా మనుస్మృతి గ్రంథాన్ని దహనం చేశారని, ఈ సంఘటన జరిగి సరిగ్గా 98 ఏళ్లు అయ్యిందన్నారు. మనుస్మృతిపై అనేక సైద్ధాంతిక సంఘర్షణలు సాగుతున్నాయని, ప్రాచీన భారత రాజ్యాంగం, మనుధర్మ శాస్త్రం అనే వాదనలు సాగుతున్నాయని చెప్పారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత భారతదేశానికి ప్రత్యేక రాజ్యాంగం ఏర్పడటం ద్వారా అంటరానితనాన్ని పూర్తిగా నిషేధించడంతో అట్టడుగు తరగతుల జీవితాల్లో వెలుగులు నింపాయని, మతోన్మాదుల చేతుల్లో పాలన, మహనీయులను కించపరుస్తున్న తీరు చూస్తే మనుస్మృతికి, రాజ్యాంగానికి మధ్య జరుగుతున్న అంతర్యుద్ధమిదియని ఇందులో కుల, మతాలతో సంబంధం లేని భారతీయులుగా ఒక్కటిగా నిలబడి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, రాజ్యాంగం లేకపోతే సామాజిక న్యాయమనేదే లేదని తెలియజేశారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన పీలేరు మండల అధ్యక్షులు ఎర్రబల్లి మల్లికార్జున, రాష్ట్ర పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు చీకటి పల్లి సాయి సంపత్, జాతీయ అంబేద్కర్ సేవా సంఘం రాష్ట్ర లీగల్ అడ్వైజర్ గుండ్లూరు సదాశివ, జిల్లా మహిళా అధ్యక్షులు గుండ్లూరు రాజేశ్వరి, శ్రీనివాసులు, మషాల్లాహ్ ఆటో యూనియన్ అధ్యక్షులు సయ్యద్ చాన్ బాష, ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్ బాష, మేము సైతం సమాజం కోసం వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ షాహిన్ షా, మాలమహానాడు మండల ప్రధాన కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్, కార్యదర్శి మద్దెల బాల గంగాధర్, కార్యవర్గ సభ్యులు తుమ్మల రవిచంద్ర, గోగుడు చింత రాజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

మనుస్మృతి గ్రంథాన్ని దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అధ్వానం అనుసంధాన రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్యన ఉన్న అనుసంధాన గ్రావెల్ రోడ్డు అధ్వానంగా ఉంది. నెర్రవాడ-చియ్యపాడు గ్రామాల మధ్య పంట పొలాల్లో ఉన్న రహదారి గుంతలమయంగా మారి రైతులకు ఇబ్బందికరంగా తయారైంది. పంట పొలాలకు ఎరువులు తరలించడం, ధాన్యాన్ని ఇంటికి తెచ్చేందుకు ఈ మార్గాన ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ మార్గానికి మరమ్మతులు చేపడితే చాపాడుకు నెర్రవాడ నుంచి తక్కువ సమయంలో వెళ్లే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. చియ్యపాడు, బద్రిపల్లె, నెర్రవాడ గ్రామాల రైతులకు ఈ మార్గంలో పంట పొలాలు ఉన్నాయి. వరి, పసుపు, మొక్కజొన్న, దోస వంటి పంటలు ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ రహదారికి అనుసంధానంగా మళ్లీ పంట పొలాలకు వెళ్లే అడ్డ రోడ్లు రెండు ఉన్నాయి. 500 ఎకరాలకుపైగా ఈ రోడ్డు పరిధిలో పంట పొలాలు ఉన్నాయి. ఈ మార్గంలో రెండు ప్రదేశాల్లో నీరు ప్రవహిస్తూ రోడ్డు అధ్వానంగా ఉంది. మిగిలిన ప్రాంతంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు ప్రయాణించేందుకు అసౌకర్యంగా తయారైంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడితే రైతులకు,ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

అసౌకర్యంగా నెర్రవాడ-చియ్యపాడు రోడ్డు

'ఉచిత బస్సు' సంక్రాంతికైనా అమలయ్యేనా..!

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చేందుకు ప్రధాన కారణం సూపర్‌సిక్స్ పథకాలేనని, వాటిలోని ప్రధాన పథకమైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సంక్రాంతికైనా అమలవుతుందానని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలే కరులతో మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం హామీని మహిళలు నమ్మి మూకుమ్మడిగా టిడిపి కూటమికి ఓట్లు వేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను విస్మరించిందని విమర్శించారు. ఏరు దాటి నంతవరకు ఓడ మల్లన్న, దాటాక బోడి మల్లన్న అన్న విధంగా కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తున్నట్లు చెప్పారు. కర్ణాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే ఆ హామీని అమలు చేసి మాట నిలుపుకుందన్నారు. తెలంగాణాలో రేవంత్‌రెడ్డి పాలనలో కాంగ్రెస్ ప్రభు త్వం అధికారం కూడా మూడు నెలల్లోపే అమలు చేసిందని తెలిపారు. ఎపిలో 6 నెలలు దాటినా ఉచిత బస్సు ప్రయాణం పథకం అతీగతీ లేదని తెలిపారు.

80 ఏళ్లు దాటిన పెన్షనర్లను సత్కరించిన సంఘ నాయకులు

పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నారు. పింఛనుదారుల దినోత్సవం సందర్భంగా బుధవారం పీలేరు పట్టణ ప్రధాన జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీలేరు శాఖ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆడిటర్ గౌతమ్ మాట్లాడుతూ పింఛనుదారులందరూ తమ ఆదాయపు పన్ను రిటర్న్ వెంటనే దాఖలు చేయాలని కోరారు. ఇన్‌కం టాక్స్ రిటర్న్ గురించి వివరించారు. ప్రభుత్వ పింఛనుదారుల సంఘం పీలేరు శాఖ అధ్యక్షులు వగళ్ళ చంద్రా రెడ్డి మాట్లాడుతూ పింఛనుదారుల ఆర్థిక స్థిరత్వానికి ఈ బకాయిలు కీలకమని, పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, డిఎ బకాయిలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. వంగిమళ్ల రామచంద్ర, జి.రాధాకృష్ణ మాట్లాడుతూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు ఎంప్లాయి హెల్త్ స్కీమ్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదనంగా, పింఛనుదారులందరూ తమ పెన్షన్‌లను కొనసాగించడానికి జనవరి 1, ఫిబ్రవరి 28 మధ్య వారి జీవిత ధృవీకరణ పత్రాలను సమర్పించాలని గుర్తు చేశారు. పింఛనుదారులకు సహాయ సహకారాలు అందిస్తున్న, ఆడిటర్ గౌతమ్, 80 సంవత్సరాల వయస్సు దాటిన పింఛన్‌దారులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి జి.యర్రమరాజు, గౌరవాధ్యక్షుడు సి.నరసింహా రెడ్డి, కోశాధికారి పి.కృష్ణయ్య, సభ్యులు బి.సీతారామయ్య, బి.ఆంజనేయులు, పి.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

- ప్రభుత్వాన్ని కోరిన రూట నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని, ఉర్దూ అంగన్వాడీలు స్థాపించాలని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమామ్ బాషా, సయ్యద్ ఇక్బాల్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నగరంలోని వినాయక నగర్‌లో ఉన్న సిటీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో రూట 35 సంవత్సరాల విజయోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్ బాబు, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు జిలాని బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడీలు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ఎందుకు కృషి చేస్తామన్నారు. ఉర్దూ విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్ రెగ్యులర్ చేసి అవసరమైన ఆచార్యుల పోస్టులు మంజూరుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లతామని చెప్పారు. ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏ ప్రభుత్వమూ ఉర్దూ భాషాభివృద్ధికి పూర్తిగా స్థాయిలో కృషి చేయలేదని తెలిపారు. 2008 ముందు, తర్వాత అధికారంలోనికి టిడిపి, వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం ఉర్దూ పాఠశాలలో ఒక్క ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉర్దూ మనుగడ తీవ్ర ప్రమాదంలో ఉందని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉర్దూ భాష చాలా ప్రమాదంలో ఉందని చెప్పారు. ఏపీ ప్రభుత్వం ఉర్దూ భాషను రెండవ అధికార భాషగా ప్రకటించిందని తెలిపారు. అమలులో చిత్తశుద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అఫ్సర్ ఖాన్, మన్సూర్ ఖాన్, ఖాజాపీర్ ఖాన్, రాష్ట్ర మైనార్టీ నాయకులు జమాల్, ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాష, రూట రాష్ట్ర నాయకులు హకీం, సిరాజ్, సత్తార్ ఫైజి, అసదుల్లా, ముజీబ్ షాహి, నఖీఉల్లా, ముస్తాక్, ఖలందర్ బాష, రఖీబ్, కలీం, ఆచార్యులు డాక్టర్ వసీవుల్లా, డాక్టర్ షాజియా, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఎలక్షన్ కమిషన్ స్వతంత్రతను ప్రజలే రక్షించుకోవాలి

ప్రజాశక్తి - కడప

ఎన్నికల కమిషన్ స్వతంత్ర స్థానం ప్రజలే రక్షించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియో జకవర్గం సమన్వ యకర్త బండి జకరయ్య అన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి సిసిఫుటేజీ, వెబ్ కాస్టింగ్, అభ్యర్థుల వీడియోలు, ఎలక్ట్రానిక్ రికార్డుల తనిఖీని నిషేధించి మోడీ ప్రభుత్వం పారదర్శకతకు నిలువునా పాతర వేసిందన్నారు. 1961 ఎన్నికల నిర్వహణ నిబంధనలోని రూల్ 93 (2)(ఎ) ప్రకారం ఎవరైనా ఎన్నికలకు సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ చేయడానికి అనుమతి ఉందన్నారు. డిసెంబర్ 20న కేంద్ర న్యాయశాఖ సవరణ నోటిఫికేషన్ ద్వారా ప్రజలకు ఇప్పుడు ఆ అవకాశం ఉండదని చెప్పారు. ఇకనుంచి ఎలక్ట్రానిక్ రికార్డుల పరిశీలన కుదరదని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఎన్నికల రూల్సును ఏకపక్షంగా మార్చేసింది అన్నారు. రిగ్గింగు, అవకతవకలు సహా ఎన్నికల్లో అక్రమాలను నిరోధించేందుకు పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం సిసి టీవీ ఫుటేజీలు, వెబ్ క్యాస్టింగ్‌ను కొనేళ్ల కిందట ప్రవేశపెట్టిందన్నారు. కానీ ప్రస్తుత రూల్స్ మార్పుపై అటువంటిదే ఉండదన్నారు. ఎన్నికల రికార్డులు బయటపడితే బిజెపికి ఇబ్బందికరమని భయంతోనే మోడీ సర్కార్ ఎలక్ట్రానిక్ రికార్డుల తనిఖీపై నిషేధం విధించిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం ఆ సవరణలను ఉపసంహరించుకోవాలన్నారు. లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని వాపోయారు. కాంగ్రెస్ నాయకులు జైరామ్ రమేష్ ఈ విషయాన్ని సుప్రీంకోర్టులో ఛాలెంజ్ చేయనున్నారని తెలిపారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

అంబేద్కర్‌పై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమితాషా వైఖరికి నిరసనగా 'అంబేద్కర్ – రాజ్యాంగం – ప్రజాస్వామ్యం అపహాస్యం' అనే అంశంపై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కన్వినర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, కో కోన్వీనర్స్ లక్ష్మిరాజా, గుర్రప్ప, గోపాల్, లెనిన్ ప్రసాద్, భాస్కర్, వెంకటేశ్వర్లు, లెఫ్ట్ పార్టీల నాయకులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు ఇంజినీర్స్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాస్వామ్య, అభ్యుదయ, అంబేద్కర్ వాదులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- రామాపురం : ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఉండే వెంకటరెడ్డి (70) ఈనెల 19న అదృశ్యమయ్యాడు. పోలీసులు అతని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా బుధవారం బుధవారం ప్రేమాలయం ఎదురుగా ఉన్న బండరాలలో మృతి చెంది కన్పించాడు. పులివెందుల మండలం భాకరాపురం చెందిన వెంకటరెడ్డి విశ్రాంత అధ్యాపకులు. మూడేళ్లుగా ప్రేమాలయంలోని వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. మతిస్థిమితం లేక మాత్రలు వాడేవాడని భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా నేడు వెంకటరెడ్డి బండరాళ్ల మధ్యలో చనిపోయి కనిపించాడు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

12 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ : పేకాట ఆడుతున్న 12 మంది అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని స్థానికేంద్రమ్మ కాలనీ సమీపంలో ఉత్తరం దిక్కున పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న 12 మంది అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.37,390 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.